ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# "నంది అవార్డుల చిత్రగీతాలు - సాహిత్య విలువలు"

**1) జి. పద్మ కళ**
పరిశోధక విద్యార్థి,తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం ,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
గుంటూరు -522510
ఫోన్ నెం :9912855195,ఈ మెయిల్ : padmakala.bhoomi@gmail.com

**2) ఆచార్య ఎన్. వి. కృష్ణా రావు**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం ,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం -522510 ,గుంటూరు -522510 ,ఫోన్ నెం :9490218173
ఈ మెయిల్ : vkraonarisetty@yahoo.com

Article Received: 16/02/2026
Article Accepted: 28/03/2026
Published Online: 30/03/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.151

**వ్యాస సంగ్రహం:**

భావ ప్రకటనా సాధనం భాష, భాషకు ప్రాణం భావం. భావానికి రూపం మాట. మాటలు కలిస్తే పాట, మాటల్లో చెప్పలేని భావాలు పాటలై మనిషి మనుగడలో భాగమై జీవితాంతం తోడు వస్తున్న మాట ఎవరూ కాదనలేం. 'పాట' ప్రవాహం వంటి ప్రక్రియ. నదిలో సాగిపోయే నీటిలా కాలానుగుణంగా వేల కొద్దీపాటలు తెలుగు సాహిత్యంలో ప్రవేశించి, ప్రవహించి అజరామరంగా చిరకాలపు మాధుర్యాల పంటలు పండిస్తున్నాయి. అడపాదడపా అపశృతులు పలికే పాటలు సాగరంలో చేరే నీటిలా తమ ఉనికిని కోల్పోతున్నాయి. పాటకు పర్యాయ పదాలుగా గీతం, గేయం అనే పదాలు వాడుకలో ఉన్నాయి. పాటలు జానపదాలు, లలితగీతాలు, దేశభక్తిగీతాలు, చిత్రగీతాలు లేదా సినిమాపాటలు, భక్తి గీతాలు, గజళ్ళు అని ఒక రకమయిన విభజన. జోల పాటలు, మేలుకోలుపు పాటలు, పిల్లల పాటలు, లాలి పాటలు, గొబ్బిపాటలు, స్త్రీల పాటలు, పెళ్ళి పాటలు, పెద్దల పాటలు, ఉత్సవ గీతాలు, సంస్కృతీ సంబంధ గీతాలు అనేది మరొక విభజన. మరింత లోతుగా గమనిస్తే సందేశాత్మక గీతాలు, విప్లవ గీతాలు, ప్రేమ గీతాలు,

విరహ గీతాలు, స్నేహ గీతాలు, ప్రేరణాత్మక గీతాలు, విషాద గీతాలు, శృంగార గీతాలు, ఆవేదనా భరిత గీతాలు, వైరాగ్యగీతాలు వంటి కోణం మరొకటి చూపవచ్చు. ప్రధానంగా యుగళ గీతాలు, ఏకగళ గీతాలు కూడా ఇందులో చేర్చదగ్గవే. నిర్మాణ రీత్యా చూస్తే పాట మాత్రా ఛందస్సులో సమతూకం కలిగిన పంక్తులతో పల్లవి, చరణాలు గా అప్పుడప్పుడు అనుపల్లవిని కూడా కలుపుకుని సాగిపోతూ ఉంటుంది. ఈ మధ్య కాలంలో వస్తున్న కొద్ది కొద్ది ప్రయోగాలు మినహా పాటలన్నిటి మౌలిక రూపం దాదాపుగా ఒకేలాగా కనిపిస్తోంది. సాధారణంగా రెండు లేదా మూడు చరణాలతో సాగే పాట నడక మనందరికీ సుపరిచితమైన విధానమని చెప్పవచ్చు.

**కీలక అంశాలు:** పాట ఆవశ్యకత, తెలుగు సినిమా పాట , సాహిత్య విలువలు,.

## 1. పరిచయం:

పరిమళించిన సమాహార రూపంగా దృశ్యమాధ్యమంతో జతకట్టిన తెలుగు పాట తెలుగు వారి అంతరంగం, జీవన శైలి, సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టినట్టు చూపించటంతో ఆబాలగోపాలానికి అత్యంత చేరువయ్యింది. ఒక్క పద్యమైనా రాని వారుంటే ఉండవచ్చునేమో కానీ ఒక్క తెలుగు సినిమా పాటయినా రాని తెలుగు వారుండరంటే అతిశయోక్తికాదు. సినిమా పాట ఇపుడు మనిషి దినచర్యలో ఒక భాగమైపోయింది. కష్టజీవులు పాటలు పాడుకుంటూ రోజువారీ పనులు చేసుకుంటూ పాటలోని ఆనందాన్ని అనుభవిస్తూ పనిలోని శ్రమను మర్చిపోతారు. అందుకే ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నదంటూ పాటలో పనిలో భాగం చేశారు సినీకవులు. తనలో తాను నచ్చిన పాటను పాడుకుంటూ, ప్రతిక్షణం తలెత్తే విభిన్న ఉద్వేగాల నుండి ఉపశమనం పొందుతూ జీవనయానాన్ని సాగిస్తున్నాడు మనిషి. వివిధ సందర్భాలలో పాట మనిషికి ఊరటని, ఉత్సాహాన్ని ఇస్తుంటే ఎంతో మందికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన పాటలూ కోకొల్లలుగా ఉన్నాయి. పాట ఆలోచనను, వివేచనను కలిగిస్తూ మనిషిని విజ్ఞానంమార్గంలో నడిపిస్తోంది. మరో పక్క వ్యాపారధోరణులు విపరీతమై పాట ప్రామాణికతను, హుందాతనాన్ని దెబ్బదీసి ప్రేక్షకులు, శ్రోతలను ముఖ్యంగా యువతరాన్ని పెడత్రోవ పట్టిస్తున్న దాఖలాలూ లేకపోలేదు. పాశ్చాత్య ప్రభావానికి తలొగ్గి కొత్తదనం పేరుతో, ఉద్రూతలూగించటమే ధ్యేయంగా, విలువలకు తిలోదకాలిచ్చి, భాషను భ్రష్టుపట్టిస్తున్న పాటలు తెలుగు సినీ సాహితీ క్షేత్రంలో చొరబడుతున్నాయని ఎందరో విమర్శకులు ఆవేదన చెందుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏటా

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

పుట్టుకొచ్చే వందలాది తెలుగు సినిమా పాటలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ, సమీక్షించుకుంటూ, గతం - ప్రస్తుతాల పునాదులపై పటిష్టమయిన భవిష్యత్తును నిర్మించుకునే ప్రయత్నం చేయవలసిందే.

**2. విలువలు - ఆవశ్యకత :**

ఏ సమాజమయినా నిర్మించబడేది విలువల పునాదిపైనే. అవేలేని నాడు అది సమాజమే కాదు. విభిన్న సంస్కృతుల మేళవింపయిన సమాజాలన్నిటికీ వినోదాన్ని, ఆనందాన్ని కల్గించే ప్రధాన మాధ్యమం సినిమా. సినిమా చూసేందుకు ప్రేక్షకులను ప్రేరేపించే ప్రధానాంశం అందులోని పాటలు. అంత శక్తివంతమయిన సాధనంగా సినిమా పాట జనజీవితంలో కలిసిపోవటం ఒక కోణమయితే నిరంతరం ప్రజల నాల్కల మీద నర్తించే సినిమా పాట వారి వారి స్వభావాలపై తప్పనిసరిగా ప్రభావాన్ని చూపుతుందనటంలో ఏమాత్రం సందేహం లేదు.

**3. తెలుగు సినిమా పాటలు - సాహిత్య విలువలు :**

'సహితస్య భావం సాహిత్యం' అన్నారు పెద్దలు. హితమును చేకూర్చునది సాహిత్యమని దీని భావం. సాహిత్యం పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, కావ్యాలు, జానపదాలు వంటి ప్రక్రియలతో పాటు కథలు, కథానికలు, గల్పికలు, వచన కవిత్వం తదితర రూపాలు దాల్చుతూ తరతరాలుగా విజ్ఞానాన్ని, వినోదాన్ని ఆధ్యాత్మికతాదులను పంచుతున్నది.

వివిధ కాలాల్లో వివిధరకాల ప్రక్రియలు వెలుగులోకి వస్తూ జనబాహుళ్యంలో చేరి అశేషమయిన ఆదరణ పొందుతున్నాయి. సాహిత్యం ప్రధానంగా లిఖిత, మౌఖిక రూపాల్లో మనకు కనిపిస్తుంది. మౌఖిక సాహిత్యం జానపదాలు, కథల రూపంలో ప్రచారంలో ఉండగా లిఖిత సాహిత్యం గ్రంథాలు, పుస్తకాలు ఆధునిక కాలంలో కంప్యూటర్, ఇంటర్నెట్లలో కూడా లభ్యమవుతోంది. లిఖిత సాహిత్యాన్ని కేవలం చదువుకున్న వారు మాత్రమే వినియోగించుకోగలరు. మౌఖిక సాహిత్యం అందరికీ అర్థమయ్యే పరిస్థితి ఉన్నా దానికి స్థిరత్వం తక్కువ. ఇటువంటి పరిస్థితులలో లిఖిత, మౌఖిక రూపాలలో, దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా జనజీవన స్రవంతిలోకి చొచ్చుకుపోయిన ప్రభావవంతమయిన ప్రక్రియ పాట.

ఆబాలగోపాలాన్ని అలరించే పాట ప్రధాన ప్రయోజనం, పరమావధి ఆనందానుభూతి అయినప్పటికీ, తరతరాల తెలుగుసినిమాపాట నడకను గమనిస్తే అంతకుమించిన ఎన్నో రకాల ప్రయోజనాలు చేకూరుస్తూండటమే కాక సమాజానికి ఎనలేని స్ఫూర్తిని, మార్గదర్శకత్వాన్ని చేస్తూ మన సినిమా పాట జాతి నిర్మాణంలో క్రియాశీలకమయిన పాత్ర పోషిస్తున్నట్లుగా తెలుస్తుంది. ఆదినుండి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

నేటివరకు కాలానుగుణంగా వచ్చే మార్పులనెన్నిటినో తనలో కలుపుకుంటూ సాగిపోతున్నది తెలుగుసినిమా పాట.

ఈనాడు తెలుగు సినిమాపాట రాష్ట్రాల సరిహద్దులన్నీ దాటి ప్రపంచ వ్యాప్తమై తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్నమాట మనందరికీ తెలిసిందే. మారుతున్న సమాజ అభిరుచులు,

సాంకేతికతా మార్పులను ఆకళింపు చేసుకుంటూ నాటి సముద్రాల, మల్లాది రామకృష్ణశాస్త్రి, పింగళి, కొసరాజు, దేవులపల్లి, శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర, దాశరథి, సినారె, వేటూరి, జాలాది వంటి హేమాహేమీలతో పాటు నేటితరం కవులు, సిరివెన్నెల,సామవేదంవారు, సుద్దాల అశోక్ తేజ, జొన్నవిత్తుల, యువకవులు చంద్రబోస్, అనంత శ్రీరామ్, వెన్నెలకంటి, వెనిగళ్ళ రాంబాబు వంటి ఎందరో గీతరచయితలు సినీ సాహిత్య జగత్తును సుసంపన్నం చేశారు.

కేవలం ఆనందమే కాక జీవితానికి అవసరమైన ఎన్నో విలువలను అందించే గొప్ప ప్రక్రియగా తెలుగు సినిమా పాట పురోగమిస్తున్నది. ఈ క్రమంలో వేలాది సంఖ్యలో ఉన్న సినీ సాహిత్యాన్ని అతి తక్కువ సమయంలో విశ్లేషించటం అరచేతుల్లో సూర్యుణ్ణి బంధించే ప్రయత్నంవంటిదే. అందువల్ల నాకిచ్చిన సమయంలో సినిమా సాహిత్య విలువలను పరిచయం చేయడానికి ప్రయత్నం చేస్తాను. విభిన్న కాలాల్లో వివిధ రకాల రచయితలు వెలువరించిన సినీ గీతాలు వాటిలో వ్యక్తమవుతున్న సాహిత్యవిలువల్ని ఓసారి పరికిద్దాం. భారతదేశ సంస్కృతి ఎంతో విశిష్టమయినది, విలక్షణమయినది. మన సినీ గీత రచయితలు తెలుగువారి ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలను గురించి మధురమయిన పదజాలంతో చక్కటి పాటలు రాశారు. ఆయా సందర్భాలలో పాడుకునే విధంగా పండుగలు, స్త్రీల నోములను, వ్రతాలు, ఆహార విశేషాదుల్ని పాటలుగా ఎంత చక్కగా మలచారో పరిశీలిస్తే ..

ముందుగా పండుగలు అందులో తెలుగువారి పెద్ద పండుగ విషయానికొస్తే..

**రావమ్మా మహాలక్ష్మి రావమ్మా**

**నీ కొవెల ఈ ఇల్లు కొలువై ఉందువుగాని..**

**కొలువై ఉందువుగాని కలుములరాణి**

దేవులపల్లి వారు ఇంత ప్రేమతో, భక్తితో ఆహ్వానిస్తే సంక్రాంతి లక్ష్మి రాకుండా ఉండగలదా.. ఈ పాట తెలుగు పల్లెజీవనంతో పాటు సంక్రాంతికి అనుబంధాలయిన అన్ని రకాల అంశాల్ని ఎంత చక్కగా

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

కళ్ళముందుంచిందో. గొబ్బపాటలు, సన్నాయి మేళాలు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు అద్భుతం.. మాటల్లో వర్ణించటం చాలా కష్టం.

ఇదే నేపథ్యంతో మరోపాట చూస్తే సంక్రాంతి మరో కోణంలో కన్పిస్తుంది. భోగిమంటలు చిత్రం కోసం రాసిన ఈ పాటలో..

భోగిళ్లో భోగిళ్లో భోగ భాగ్యాలా భోగిళ్లో
భోగి మంటలా భోగిళ్లో..
తెల్లారకుండానే పల్లెల్లోన

సంక్రాంతి పండగల భోగిళ్లో..

అంటూ ఈ పాట భోగిమంటల ప్రాశస్త్యాన్ని చెప్పటమే కాకుండా గ్రామాల్లో ఊరంతా కలసికట్టుగా చేసుకునే సంబరాలుగా సంక్రాంతిని వర్ణించిన తీరు చక్కగా ఉంది .

మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో నోచుకునే నోములన్నీ సినిమాపాటల రూపంలో ఎంత చక్కగా ఇమిడ్చారో చూడండి..

శ్రీ సత్యనారాయణుని సేవకు రారమ్మా..
మనసారా స్వామిని కొలిచి హారతులీరమ్మా !....
నోచిన వారిని నోచిన ఫలము.. చూసిన వారికి ఫలము

అంటూ వ్రతకథాసారాంశాన్ని ఫలశ్రుతినీ కలిపి రాసిన ఈ పాట ఎన్నో పూజాదికాలలో భజనలలో మహిళలు ఎంతో ఇష్టంగా పాడుకుంటున్నారు.

మహిళలు నిష్ఠగా ఆచరించే వ్రతాల్లో ముఖ్యమయిన కార్తీక మాస వ్రతం కూడా సినీ కాంతుల్తో ప్రభాసిస్తోందంటే అతిశయోక్తిలేదు.

ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం..
చేరనీ నీ పాద పీఠం కర్పూర దీపం ..

అంటూ మగువల హృదయాన్ని ఆవిష్కరించటమే కాదు ఆకాశంలోని తారల్ని ముత్తయిదువలుంచిన చుక్కలుగా చిత్రీకరించటం కృష్ణశాస్త్రికి మాత్రమే సొంతమయిన గొప్ప భావుకతగల సాహిత్యమిది.

ఇక తెలుగువారి ఆహారపదార్థాల మాటొస్తే మొట్టమొదటిగా ముచ్చటించాల్సిన పాట మాయాబజార్ చిత్రానికి పింగళి నాగేంద్రరావు రాసిన పాట

వివాహ భోజనంబు వింతైన వంటకంబు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

వియాల వారి విందు ఒహెూహెూ నాకె ముందు,

ఈ పాటలో ప్రతి పదం ఎంత చక్కగా ఇమిడిపోయిందో చూడండి..

ఔరౌర గారెలల్ల .. అయ్యారె బూరెలిల్ల ..
అహెూరె అరెసులుల్ల.. ఇయెల్ల నాకు చెల్ల...

ఈ అంత్య ప్రాసలు సందర్భోచితంగా గుప్పించటమే కాదు తెలుగువారి వంటకాలన్నిటినీ కళ్లముందుంచి గిలిగింతలు పెట్టే చమత్కారం ఎంత మనోహరమో కదా ! ఈ మధ్య కాలంలో వచ్చిన మరొక చక్కని పాట ..

తాజా కూరలలో రాజా ఎవరనిన ఇంకా చెప్పాలా.. వంకాయే...
ఆహా ఏమి రుచి.. అనరా మైమరచి
రోజూ తిన్నఆ మరి మోజే తీరనిది..

ఇది తెలుగువారి ప్రత్యేక వంటకం గుత్తివంకాయ కూరపై ఓ సరదా పాట. నూరేళ్ల జీవితానికి బాల్యం పునాది. తెలుగుతోటలో పసిడి వన్నెలుగా వచ్చిన పిల్లల పాటల్లో ఉన్న చక్కని సాహిత్యాన్ని ఇపుడు గమనిద్దాం. పసివయసులో చిగురించే స్నేహాలు చాలా స్వచ్ఛమయినవి గా ఉంటాయి. ఈ అంశాన్ని ప్రతిబింబిస్తూ వచ్చిన ఓ మంచిపాట..

గున్నమామిడీ కొమ్మ మీద గూళ్ళు రెండున్నాయి..
ఒక గూటిలోనా రామచిలకుంది ఒక గూటిలోనా కోయిలుందీ

ఇందులోనే "రంగూ రూపూ వేరైనా తమ జాతీరీతీ వైరైనా /చిలకా గోరింక చేసిన చెలిమి ముందు తరాలకు తరగని కలిమీ..." అంటూ, లేతవయసులో భేదభావాలెరుగని స్వచ్ఛమయిన స్నేహాలకు బాటలెయ్యటం కంటే గొప్ప కృషి మరొకటి ఉండదనిపిస్తుంది. పిల్లల మధ్య వెలిగే అంతరాల్లేని చెలిమి వారి మనోవికాసానికి దారిచూపుతుంది. ఈ పాట పసిమనసులకే కాదు పెద్దలకీ ఎంతో ఆనందాన్నిస్తుంది. మరొక చక్కని పాట... "పిల్లలూ దేవుడూ చల్లని వారే కల్లకపటమెరుగనీ కరుణామయులే /తప్పులు మన్నించుటే దేవుని సుగుణం/ ఇది గొప్పవాళ్లు చెప్పినట్టి చక్కని జ్ఞానం.." ఈ పాటలో రెండు మంత్రాల వంటి బోధనలున్నాయి. "వెలుగుతున్న సూర్యుడ్ని మబ్బు మూయును/ మనిషి తెలివి అనే సూర్యుణ్ని కోపం మూయును/ గాలివిచ మబ్బుతెరలు తొలగిపోవులే/ మాటకలుపుకున్న కోపమే చెలిమి అగునులే.."

సినిమాకు సందర్భోచితంగా రాయడమే కాదు సర్వమానవాళికీ వర్తించే ఎన్ని గొప్ప సందేశాలో మన తెలుగుపాటల్లో. క్షమించటం అనే గొప్ప లక్షణం అలవర్చుకుంటే మనిషే దేవుడవుతాడని కవి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

చెబుతున్నాడిక్కడ. అలాగే కోపమున ఘనత కొంచెమైపోవునన్న విషయాన్నీ చెబుతున్నాడు. బాల్యం సుందరస్వప్నం. బాల్యంలో ఏర్పడ్డ భావాలు జీవితాంతం కొనసాగుతాయని కాబోలు ఈ గీతరచయిత సకల సద్గుణాల సారంగా ఈ పాటను చిన్నారులకు కానుకచేశాడు.

అందమయిన జీవితానికి ఆలంబనలయిన గుణగణాలుగా ప్రేమ, స్నేహం, కరుణ, దయ, సోదరభావం వంటి ఉన్నత విలువలను మెండుగా పండించిన సినీగీతాలు మనకు అసంఖ్యాకంగా ఉన్నాయి. నిజమైన ప్రేమ ఏదో గుర్తించలేని పరిస్థితి నేటి కాలంలో ఉండగా మన పెద్దలు ఏనాడో ప్రేమకు స్పష్టమయిన నిర్వచనాన్నిచ్చారు. అలనాటి ప్రేమ గీతాలే ఇందుకు సాక్ష్యాలు, "ఎక్కడ ఉన్నా ఏమైనా మనమెవరికి వారం వేరైనా/ నీ సుఖమే నే కోరుతున్నా నిను వీడి అందుకే వెళుతున్నా..." అంటూ నిజమైన ప్రేమ ప్రియుల క్షేమం కోరుతుంది. వారి శ్రేయస్సు కోసం ఎంతటి త్యాగానకయినా సిద్ధపడే ఔదార్యాన్నిస్తుంది. అటువంటి స్వచ్ఛమైన ప్రేమ కలిగేది చిరకాలం నిలిచేది స్వార్థరహిత జీవనంలోనే. ప్రేమ ప్రకృతి ప్రసాదించిన వరం. సహజసుందరంగా హృదంతరాల్లోంచి పొంగిపొర్లే భావపరంపర. ప్రేమ రెండు గుండెల స్పందన.

యాసిడ్ దాడులు, ప్రతీకార చర్యల వంటి వికృత చేష్టలకు ఏ హృదయమూ స్పందించదు. ప్రేమ ఒకరి వ్యక్తిగతమయిన విషయం. వారి మనసుకు సంబంధించిన అంశం. బలవంతంగా ప్రేమించమని శాసించే హక్కు ఎవరికీ లేదు. బలప్రదర్శన మానవత్వమనిపించుకోదు. ఈ విషయం తెలిసిన కవి తన పాటలో ప్రియుడి పాత్రను ఎంత ఆదర్శవంతంగా చూపించాడో. "ఎందువల్ల నను కాదన్నావో ఎదురు ప్రశ్నలే వేయనుగా/ ఎదురుచూపులే ఆపనుగా../ ఏనాటికో ఓ నాటికి నీ ప్రేమ సాధిస్తా..." ఈ పంక్తుల్లో యువకుడికి నిజాయితీతో కూడిన తన ప్రేమ మీద ఉన్న అపారమయిన విశ్వాసం కనపబడుతుంది. ఏనాటికైనా ఆమె ప్రేమను సాధిస్తాననే నమ్మకం తప్ప ఆమెను ఇబ్బంది పెట్టే తలపు ఏమాత్రమూ కనపబడదు, పైగా అతని మాటల్లో తాను కోరుకున్న ప్రేమ కోసం జీవితకాలం ఎదురుచూడగల మంచితనం కనబడుతుంది.
కాలానుగుణంగా వస్తువు ఎంపికలో రచయితలు చూపుతున్న నేర్పు కూడా సాహిత్యవిలువలు ప్రకటించే స్థాయిని పెంచుతున్నాయని చెప్పవచ్చు.

మనసుల్ని మురిపించి మైమరపించే మల్లెలు, జాజులు, గులాబీలు, బంతి చేమంతుల వంటి పూలు ప్రధానపాత్రధారులుగా పాటల్ని నడిపించిన సందర్భాలెన్నో. హాయిని, మనోల్లాసాన్నీ నింపే వెన్నెల పాటలు, ఆహ్లాదాన్ని పంచే వసంతగీతాలూ మన తెలుగు తెరపై చక్కగానే మెరిసాయని చెప్పవచ్చు. కథానాయికా వర్ణనలకు పుష్పాలను, నాయకులకు జాబిల్లిని వాడిన సందర్భాలే ఎక్కువగా కనిపిస్తాయి.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

పాట మొత్తం ఆపాతమధురంగా అలరారే ఆణిముత్యాలు కొన్నయితే అక్కడక్కడా మెరిసే అద్భుతాల మణులు కొన్ని, పాట మొత్తం కావచ్చు, కొన్ని పంక్తులు కావచ్చు పదాలు కావచ్చు.. చిత్రానికి, పాటకి మకుటాయమానంగా భాసిల్లి, ప్రేక్షకుల, శ్రోతల హృదయాలలో ముద్రించబడిన సందర్భాలూ కోకొల్లలు.

భావుకత ఉన్న కవికి ప్రకృతినిండా వస్తువులే. తన కలంతో ఏ విషయాన్ని స్పృశించినా అది మహోన్నతమయిన సాహిత్యమే. ఆ విషయాన్ని నిరూపిస్తూ ఎందరో ప్రకృతిలో వివిధ అంశాలను తమ కవితా వస్తువులుగా స్వీకరించి మనిషి జీవితానికి దిశానిర్దేశ్యం చేశారు. ఎన్నో ఆధ్యాత్మిక ప్రసంగాలు, వ్యక్తిత్వ నిర్మాణ ప్రత్యేక తరగతులు తీసుకురాలేని మార్పు ఒక్కొక్క సారి సూటిగా హృదంతరాలలో చొచ్చుకున్న ఒక్కపాట తేగలిగిన సందర్భాలూ ఉన్నాయి. అందుకు ఉదాహరణగా.. మహా కవి శ్రీశ్రీ పాట చూపవచ్చు.

'అగాధమగు జలనిధిలోనా ఆణిముత్యమున్నటులే శోకాలా మడుగున దాగీ సుఖమున్నదిలే ఏదీ తనంత తానను నీ దరికి రాదు శోధించి సాధించాలి ... అదియే ధీరగుణం..!
కల కానిదీ విలువైనదీ బ్రతుకు కన్నీటి ధారలలోనే బలిచేయకు..

జీవితంలోని ఒడిదుడుకులకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోబోయిన ఓ వ్యక్తి ఈ పాట విని, ఆ ప్రయత్నాన్ని విరమించుకున్న సంఘటన ఒకానొక సమయంలో వెలుగులోకి వచ్చిన దాఖలాలున్నాయి. జీవితంపై ఆశను కలిగించిన అంతటిగొప్ప స్ఫూర్తినిచ్చిన ఇటువంటి పాటలే సాహిత్య పరమార్థాన్ని చెబుతున్నాయి.

సాగరాంతరాల్లోని సంపదలు సామాన్యులకి దొరుకుతాయా అని నిరాశతో మిన్నకుండే కంటే శ్రమించాలి, శోధించి సాధించాలి. విజయానికి మొదటిమెట్టు పట్టుదలయితే రెండవమెట్టు సహనం. ఓర్పు, వినయ విధేయతలు, ఆత్మవిశ్వాసం కూడా ఎదుగుదలకు గొప్ప బాటలు వేస్తాయి. ఈ పల్లవిని పరిశీలిస్తే సుభాషిత రత్నాలు మనకి స్ఫురణకి వస్తాయి. మౌనంగానే ఎదగమనీ మొక్కనీకు చెబుతుంది ఎదిగిన కొద్దీ ఒదగమనీ అర్థమందులో ఉంది. అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది ఆకులన్ని రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది... గొప్ప విజయాలు సాధించాలనుకున్నవారు గొప్ప ప్రయత్నాలు చేయాలి. ఈ దిశలోనే సాగిన ఇతర పంక్తులు ఈ మధ్య కాలంలో బహుజనాదరణ పొందాయి. సాగర మథనం మొదలవగానే విషమే వచ్చింది విసుగే చెందక కృషి చేస్తేనే అమృతమిచ్చింది అవరోధాల దీవుల్లో ఆనంద నిధి ఉన్నది కష్టాల వారధి దాటిన వారికి సొంతమవుతుంది··· భారతీయ సంస్కృతిలో కుటుంబజీవన

విధానానికి ఒక విశిష్టత ఉంది. వివాహ బంధం కుటుంబ జీవనానికి మూలాధారం. ప్రపంచ దేవాల్లో కొనసాగుతున్న వివాహ బంధాల కంటే భారతీయ వివాహ వ్యవస్థ ఎంతో పటిష్ఠమయినది. కుటుంబ వ్యవస్థ నిర్మాణంలో స్త్రీ, పురుషులిద్దరికీ సమాన బాధ్యత ఉంది. ప్రేమాభిమానాలు, ఆత్మీయతానురాగాలు, సహనసౌశీల్యాలకు ప్రతీక స్త్రీమూర్తి. ఆమె ప్రేమ జీవనయానానికి చుక్కాని వంటిది. ఆ ప్రేమను కోల్పోయిన పురుషుడు చెందే ఆవేదనను కవి వర్ణించిన సందర్భంలో.. నిన్ను నిన్నుగా ప్రేమించుటకు నీ కోసమె కన్నీరు నింపుటకు నేనున్నాని నీడగ నిలిచే.. తోడొకరుండిన అదే భాగ్యమూ... అదే స్వర్గమూ.... మనసున మనసై బ్రతుకున బ్రతుకై... తోడొకరుండిన అదే భాగ్యమూ... అదే స్వర్గమూ.... కలిమిలేములలో ఒకే రీతిగా కడవరకు పురుషుని తోడై నిలచే మహోన్నతమూర్తి మగువ. అటువంటి భార్య విలువను మగవారికి తెలియజెప్పేందుకు కవి కూర్చిన పదజాలమిది. కలిసిరాని కాలం వెలేవేసినా విడిచిపోని బంధం తనై ఉండగా సహ ధర్మ చారిణి సరిలేని వరమని సత్యాన్ని కనలేని నాడు... మోడుగా మిగలడా పురుషుడూ... అపురూపమైనదమ్మ ఆడజన్మ ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మ మగవాడి బ్రతుకులో సగపాలు తనదిగా జీవితం అంకితం చేయగా.. మరో పక్క తాహతుకు మించిన కోరికలతో భర్తను అనుక్షణం ఇబ్బంది. పెడుతూ భర్త స్థానాన్ని, విలువను గుర్తించలేని ఆడవారినీ సున్నితంగా మందలించే శక్తీ కేవలం కవికే ఉందన్నట్లుగా మనకు తెలియజెప్పే పాటలూ ఉన్నాయి. శుభలగ్నం చిత్రం కోసం సిరివెన్నెల కూర్చిన పదమాలిక ఇది.

చిలక ఏ తోడు లేక ఎటేపమ్మ ఒంటరి నడక .. తెలిసి అడుగేసినావే ఎడారంటి ఆశల వెనుక.. మంగళ సూత్రం అంగడి సరుకా కొనగలవా చేయొరాక లాభం ఎంతొచ్చిందమ్మా .. సౌభాగ్యం లమ్మేశాక.. అత్యాశతో, స్థాయికి మించిన కోరికలతో కుటుంబజీవితంలోని ఆనందాన్ని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ ఇల్లాలిని ఓ వంక ఓదారుస్తూనే మరో ప్రక్క స్త్రీ జాతికి హితవు పలికే విధానం ప్రశంసించదగ్గదే. ఎవరెన్ని చెప్పినా వినిపించుకోకుండా చిన్న చిన్న మనస్పర్థల మూలంగా చక్కని వైవాహిక జీవితాన్ని దూరం చేసుకుంటున్న జంటలు రానురానూ పెరుగుతుండటం చూసి ఆవేదన చెందిన ఓ కవి అవకాశాన్ని అందిపుచ్చుకుని తన హృదయాన్ని ఎంత చక్కగా ఆవిష్కరించాడో చూడండి ... కోడి ఒక కోనలో పుంజు ఒక కోనలో పిల్లలేమో తల్లడిల్లె ప్రేమ లేనె కానలో.. ఇందులో కవి తీసుకున్న పోలిక కూడా ఎంత సరిగ్గా తూగిందో.. కోడి కుటుంబ జీవనానికి చక్కని ఉదాహరణ. ప్రకృతినే పుస్తకంగా మలచి మానవాళికి మంచి చెడులు బోధించడానికే తమ జీవితాలను వెచ్చించిన మహనీయులకు ఈ సందర్భంగా జేజేలు పలుకుదాం.

తల్లిదండ్రులు ఇరువురూ లేకుండా ఏ ఒక్కరి దగ్గరో పెరిగే పిల్లల్లో మానసిక వికాసం సరిగా జరగదు. వారిలో ఆ వెలితి స్పష్టంగా కనిపిస్తుంది. పిల్లలకు వారి స్థాయిలో తగ్గ భయాందోళనలుంటాయి. కానీ వారు తమ భావాలన్నిటినీ పెద్దలవలే బయటికి చెప్పుకోలేరు, ఒకవేళ చెప్పుకుందామనుకున్నా పెద్దలు పిల్లల హృదయాన్ని అర్థం చేసుకుని వారి మాటలకు ప్రాధాన్యాన్నివ్వరు ఆలోచించండి ఓ అమ్మా నాన్నా...com ఏం చెప్పగలం మీకు ఇంతకన్నా... మనసున్న మనిషులెవరికైనా ఒళ్ళు జలదరిస్తుంది ఈ పాట వినగానే. మనకి తెలియకుండానే మనసు ఆలోచించడం మొదలు పెడుతుంది. పిల్లల మనసులకు చేసే ప్రతి చిన్న చిన్న గాయమూ మదిలో తిరిగి తిరిగి వెంటాడుతుంది. బాధ్యత కలిగినవారు కొందరైనా ఇటువంటి మాటలు విని మారుతారు. కవి కోరేదీ అదే.

తల్లిదండ్రులను శ్వాస ఉన్నపుడే స్మశానవాటికలో వదిలిపెట్టిపోయే కసాయి హృదయమున్న బిడ్డలున్న ఈరోజుల్లో అమ్మస్థానానికున్న విలువను చెబుతూ రాసిన ఈ పాట ప్రతి గుండె తలుపుతట్టి తీరుతుందని చెప్పవచ్చు. అందరినీ కనే శక్తి అమ్మ ఒక్కతే అవతార పురుషుడైనా ఓ అమ్మకు కొడుకే.. అమ్మను దైవంగా ఆరాధించమనే భావనలో ఈ పాట గొప్పగా మలచబడింది.

సోమరితనం అభివృద్ధికి గొడ్డలిపెట్టు. మహా కవి శ్రీశ్రీ మహాప్రస్థానంలో.. ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన సోమరులారా చావండి.. " అన్నట్లు విలువయిన సమయాన్ని విలాసం పేరుతో వృథా చేసుకునే వాళ్ళకి కనువిప్పు కల్గించడం తమ బాధ్యతగా సీకరించారు మన గేయకవులు. అందుకు సాక్ష్యాలే ఈ పాటలు. మత్తు వదలరా.. నిద్దుర వదలరా ఆ మత్తులోన పడితే గమ్మత్తుగా చిత్తవుదువురా జీవితమున సగభాగం నిద్దురకే సరిపోవు మిగిలిన ఆ సగభాగం చిత్తశుద్ధి లేకపోవు అతి నిద్రా లోలురు తెలివి లేని మూర్ఖులు కర్తవ్యం గానలేక వ్యర్థంగా చెడతారు··· సోమరుల్ని చైతన్యపరుస్తూ నిద్రాలోలుల్ని తట్టిలేపుతూ చేసే ఈ సాహిత్యం సర్వకాలాలకూ వర్తిస్తుంది. అడ్డదారుల్లో పోయి సంపాదించకుండా నిజాయితీతో జీవనాన్ని సాగించమన్నది ఈ పాట సందేశం. మనిషిగా పుట్టడం కన్నా విలువలతో జీవించటం మిన్న అంటూ ఏ పనిచేసినా నిజాయితో చేయాలని సూచిస్తూ ధర్మోరక్షతి రక్షిత: అన్న ఆర్షధర్మాన్ని గుర్తుచేస్తున్నారు కవులు.

**4. ముగింపు:**

ఈ విధంగా సాంఘిక, సామాజిక, కుటుంబ, ఆధ్యాత్మికాది విలువలెన్నిటినో పంచుతూ, అడుగడుగునా తోడుగా మనవెంటే నడుస్తూ ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్నీ, ధైర్యాన్నీ, ప్రేరణనీ,

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

బాధ్యతాయుతమయిన ఆనందమయ జీవితాన్ని ఇస్తూ తెలుగు సినిమా పాట మన జీవనగమనంలో మమైకమై సాగింది.

**5. ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సినిమాపాట చరిత్ర - డాక్టర్ పైడిపాల
2. సినిమా పాటల్లో సాహిత్య విలువలు- డాక్టర్ చిట్టిబోయిన, కోటేశ్వరరావు
3. ఘంటసాల మధుర గీతాలు-నారాయణ డి.వి.వి.ఎస్.
4. డాక్టర్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం మధుర గీతాలు- నారాయణ డి.వి.వి.ఎస్
5. పద్మశ్రీ ఘంటసాల సుమధుర గానసుధ - కె. కాశీ విశ్వేశ్వరరావు
6. కృష్ణపక్షము-దేవులపల్లి కృష్ణశాస్త్రి